
వామ్మో.. కోతులు!

- బాల్కొండ మండల కేంద్రంలో వానరాల స్వైరవిహారం
- బయటకు వెళ్లాలంటే జంకుతున్న జనం



బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలో నిత్యం కోతుల బెడదతో స్థానికులు, మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలు జంకుతున్నారు. మండల కేంద్రంలో కొన్నాళ్ల నుంచి కోతుల సంచారం నిత్యం పెరుగుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కార్యాలయాలకు వెళ్లే రోడ్డుపై నిత్యం వందల కోతులు సంచరిస్తున్నాయి. అంతే కాకుండా ఉన్నత పాఠశాల ప్రహరీపై, ప్రభుత్వాస్పత్రి ప్రహరీపై కూర్చొని మండల కార్యాలయాలకు వచ్చే జనాలకు చుక్కలు చూపిస్తున్నాయి. ఆ దారి గుండా వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. చేతుల్లో ఉన్న డాక్యుమెంట్లను సైతం ఎత్తుకెళ్తున్నాయి.

వాహనాల కవర్లు ఉంచడం లేదు..

మండల కార్యాలయాల వద్ద బైక్‌లు, కార్లు పార్కింగ్ చేసి కార్యాలయాలకు వెళ్లి తిరిగి వచ్చే లోపు పెట్రోల్ ట్యాంకు కవర్లు, సీట్ కవర్లను చింపేస్తున్నాయి. దీంతో వాహనాలను కూడా నిలుపటానికి భయపడుతున్నారు. అధికారులు రోజూ ఒక కొత్త కవరు వేసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాని కోతుల నివారణ కోసం అధికారులు సైతం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. గతంలో కోతులను పట్టించారు. కాని మళ్లీ కోతుల మందలు మందలుగా వచ్చి చేరాయి. జీపీ ఆధ్వర్యంలో కొండెంగలను తీసుకువచ్చి కోతుల బెడద నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్లకు జాలీలు..

మండల కేంద్రంలో కోతుల బెడద నుంచి తప్పించుకోవడనికి స్థానికులు తమ ఇళ్లకు జాలీలను ఏర్పాటు చేసుకున్నారు. ఇంటికొక వ్యక్తి కర్రను పట్టుకుని కోతులు లోపలికి రాకుండా కాపలా కాయాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. తలుపు తెరిస్తే చాలు కోతులు లోపలికి వచ్చి హంగామా చేస్తున్నాయని వాపోతున్నారు. కోతులను పట్టించి అడవులకు తరలించాలని కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



కోతల బెడద తీవ్రంగా ఉంది. దీంతో నిత్యం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దారి గుండా కూరగాయలు తీసుకొని వెళ్తున్నా వెంటపడి లాక్కెళ్తున్నాయి. ఏది కొనుక్కొని వెళ్లాలన్నా భయమేస్తుంది. కోతులను పట్టి అడవుల్లో వదిలిపెట్టాలి. –రాజేందర్, స్థానికుడు

క్లుప్తంగా

ఉద్యోగాల సంఖ్యను పెంచాలి



ఆర్మూర్‌టౌన్: గ్రూప్–2, 3లో ఉద్యోగాల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం వారు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 6 నెలలు కావస్తున్నా గ్రూప్–2,3 పోస్టుల సంఖ్యను పెంచడంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఇప్పటికైన పోస్టుల సంఖ్యను పెంచాలని నిరుద్యోగులు కోరారు.

ఆర్మూర్ అభివృద్ధికి కృషిచేయాలి



ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ అభివృద్ధికి బిల్‌కలెక్టర్లు మరింత కృషిచేయాలని చైర్‌పర్సన్ వన్నెల దేవి లావణ్య అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం బిల్‌కలెక్టర్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో ఐదుశాతం పన్నులు వసూలు చేయడంలో జిల్లాలోనే ఆర్మూర్ మొదటి స్థానం నిలిచిందన్నారు. ప్రతి సంవత్సరం అస్తిపన్నులు వసూలులో అనుకున్న లక్ష్యాన్ని సాధించడంలో బిల్‌కలెక్టర్‌లు చేస్తున్న పాత్ర మరువలేనిదన్నారు. కమిషనర్ రాజు, మున్సిపల్ సిబ్బంది, బిల్‌కలెక్టర్లు పాల్గొన్నారు.

సర్వేను సకాలంలో పూర్తి చేయాలి



రుద్రూర్: మిషన్ భగీరథ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని బోధన్ డివిజనల్ పంచాయతీ అధికారి సాయిబాబా ఆదేశించారు. మండలంలోని అంబం (ఆర్), అక్బర్‌నగర్ గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. సర్వే కోసం ఇంటింటికి వస్తున్న సిబ్బందికి సహకరించాలని స్థానికులకు సూచించారు. మండలంలో ఇప్పటి వరకు 45శాతం సర్వే పూర్తయినట్లు ఎంపీవో సాయిలు పేర్కొన్నారు. సిద్దాపూర్, చిక్కడపల్లి, రాయకూర్ క్యాంపులో వందశాతం పూర్తయినట్లు వివరించారు. మిగిలిన గ్రామాల్లో త్వరగా పూర్తి చేయించాలని ఎంపీవోను ఆదేశించారు. కార్యదర్శులు గంగారాం, శ్రావణ్ ఉన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన



రుద్రూర్: మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం, ఐకేపీ ఆవరణలో శనివారం కీటక జనిత వ్యాధులపై మలేరియా నోడల్ ఆఫీసర్ రాజేందర్ అవగాహన కల్పించారు. దోమల ద్వార వచ్చే వ్యాధులు, వాటి లక్షణాలు వివరిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెల్త్ సూపర్‌వైజర్‌లు రవి, సుమతి, హెల్త్ అసిస్టెంట్స్ శిరీష, గౌరి, ప్రమీల, ఆశావర్కర్లు ఇందిర, పుష్ప, ప్రమీల పాల్గొన్నారు.

పోతంగల్ గ్రామంలో..

పోతంగల్ (రుద్రూర్): పాత పోతంగల్ గ్రామంలో శనివారం మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది లార్వా సర్వే చేశారు. దోమల లార్వా వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని ప్రజలకు సూచించారు. సిబ్బంది నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలకు న్యాయం చేయాలి

రుద్రూర్: ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్‌మాస్టర్‌గా బీఈడీ అర్హత ఉన్న ఎస్‌జీటీలకు పదోన్నతి ఇచ్చి న్యాయం చేయాలని కోటగిరి ఉమ్మడి మండల ఎస్‌జీటీ ఉపాధ్యాయులు కోరారు. మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు చర్చించారు. పండిత్, పీఈటీ అప్‌గ్రేడేషన్‌లో కామన్ సీనియారిటి ప్రకారం పదోన్నతి కల్పించాలన్నారు. ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులో గతంలో మాదిరిగా బీఈడీ అర్హత గల ఎస్‌జీటీ టీచర్లకు జీవో 12 ప్రకారం పదోన్నతి ఇవ్వాలన్నారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలి

బోధన్: ప్రయివేట్ స్కూల్స్, కాలేజీలకు సంబంధించిన బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలని, ఆతర్వాతే రవాణకు అనుమతి ఇవ్వాలని భారతీయ విద్యార్థి సేన(బీవీఎస్) నాయకులు కోరారు. ఈమేరకు శనివారం వారు పట్టణంలోని ఆర్టీవో కార్యాలయంలో ఎంవీఐ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. డ్రైవర్లు నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కస్ప లింగం, ఆకాష్, శ్రీకాంత్, శ్రీధర్, సన్నీ, శేఖర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



తొండాకూర్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో దుర్గా ప్రసాద్



నందిపేటలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న డీఈవో

డొంకేశ్వర్(ఆర్మూర్): విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి నిర్వాహకులకు సూచించారు. మండలంలోని తొండాకూర్ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల హాజరు, బాడిబాటలో అడ్మిషన్లను పరిశీలించారు. అడ్మిషన్ల సంఖ్యను మరింత పెంచడానికి కృషి చేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు సమయానుసారం సెలబస్ పూర్తి చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. సీఎంవో శ్రీనివాసరావు, హెచ్‌ఎం లింగారెడ్డి ఉన్నారు.

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. అడ్మిషన్లు, మధ్యాహ్న భోజన నిర్వహణ, ఐఎఫ్‌పీఎస్‌ల నిర్వహణలపై సమీక్షించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. హెచ్‌ఎం మంజుల, మల్కన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమతిలేని బడులపై చర్యలు తీసుకోవాలి

బోధన్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ (అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య) రాష్ట్ర సహాయ కార్యదర్శి జబ్బర్ నాయక్ అధికారులను కోరారు. పట్టణంలో శనివారం నిర్వహించిన సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాహక్కు చట్టానికి లోబడి ఫీజులను నియంత్రించడంలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ మోసిన్, అమేర్, సందీప్, రవి, సురేష్, దినేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారి



పచ్చలనడ్కుడలోని కల్వర్టు వద్ద కుంగిపోయిన రోడ్డు

వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై నిర్మించిన కల్వర్టు వద్ద రోడ్డు కుంగిపోయి అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కల్వర్టు నిర్మించి ఏడాది కావస్తున్నా తారు వేయకపోవడంతో కల్వర్టుకు రెండు వైపులా రోడ్డు కుంగిపోయి గుంతలా ఏర్పడింది. ఈక్రమంలో కల్వర్టు వద్ద బైక్‌లు కుదుపులకు గురవుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆవుల అక్రమ రవాణాకు కట్టడి



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అధికారులు

రెంజల్(బోధన్): బక్రీద్ పండగ సందర్భంగా ఆవుల అక్రమ రవాణాను పోలీసులు, అధికారులు కట్టడి చేశారు. శనివారం మండలంలోని సాటాపూర్‌లో నిర్వహించిన పశువుల సంతలో నిఘా ఏర్పాటు చేశారు. కొనుగోలుదారులు, విక్రయదారుల ఆధార్‌కార్డుల జిరాక్స్‌లు తీసుకొని మండల పశువైద్యాధికారులు ధ్రువీకరణపత్రాలు జారీ చేశారు. బోధన్ రూరల్ సీఐ నరేశ్‌కుమార్ పర్యవేక్షణలో రెంజల్ ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరిమితికి మించి వాహనాల్లో పశువులను తరలించకుండా చర్యలు తీసుకున్నారు. ఆవులను సంతకు తీసుకురాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో పోలీసులు సఫలీకృతులయ్యారు. పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ, రెంజల్, ఎడపల్లి మండలాల పశువైద్యాధికారులు విఠల్, సందీప్‌రెడ్డితోపాటు ఎంపీవో గౌస్ పాల్గొన్నారు.

నియామక ఉత్తర్వులు ఇప్పించాలి



భీమ్‌గల్: 61ఏళ్ల పైబడిన వీఆర్‌ఏల వారసులకు వెంటనే నియామక ఉత్తర్వులు ఇప్పించాలని వీఆర్‌ఏల సంఘ సభ్యులు కోరారు. ఈమేరకు శనివారం వారు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వీఆర్‌ఏలను రెగ్యులర్ చేయడంతోపాటు కారుణ్య నియామకాల కోసం జీవో నెంబర్ 81, 85 ప్రకారం 3797 మంది వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత ఉత్తర్వులు ఇప్పించాలని వారు కోరారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య



రుద్రూర్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తారని ఎంపీపీ అక్కపల్లి సుజాతనాగేందర్ అన్నారు. మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు శనివారం ఆమె అధికారులతో కలిసి నోట్‌బుక్స్, స్కూల్ యూనిమ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ ఇస్తారన్నారు. తహసీల్దార్ వెంకటేశం, ఎంపీడీవో సురేష్‌బాబు పాల్గొన్నారు.

పిల్లలందరికీ మాత్రలు వేయాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

ఆర్మూర్‌టౌన్: 1నుంచి 19 సంవత్సరాల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ అన్నారు. ఆర్మూర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 20 నేషనల్ డివామింగ్ డే సందర్భంగా ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు అంగవాడీ టీచర్లకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులందరికీ మాత్రలు వేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యులు అయేషా ఫాతిమా, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, సిబ్బంది అనురాధ, రాజవ్వ, విజయ, కమల తదితరులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకుందాం



మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌టౌన్(బోధన్): పండుగలను అందరం కలిసి ప్రశాంతంగా జరుపుకుందామని ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బోధన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఇరువర్గాల పెద్దలను ఉద్దేశించి ఏసీపీ మాట్లాడారు. సోమవారం బక్రీద్ పండుగ ఉందని, రానున్న రోజుల్లో వినాయక చవితి ఇతర పండుగలు సైతం ఉన్నాయని, ఈ పండుగల్లో ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు జరుగకుండా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలని సూచించారు. పుకార్లు నమ్మరాదని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేస్తామని, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సూచించారు. సీఐ వీరయ్య, ఎస్సై రామారావు, ఇరు వర్గాల మత పెద్దలు ఉన్నారు.

నియామకం



నిజామాబాద్‌నాగారం: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షుడు జిల్కర్ విజయానంద్ లయన్స్ జోన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈమేరకు లయన్స్ జిల్లా గవర్నర్ నగేష్ పంపటి శనివారం విజయానంద్‌కు నియామకపత్రం అందజేశారు. విజయానంద్ ఇందూర్, కామారెడ్డి, కామారెడ్డి వివేకానంద, సదాశివనగర్ క్లబ్‌లకు జోన్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. నియామకంపై క్లబ్ ప్రతినిధులు కార్యదర్శి చింతల గంగాదాస్, మచ్చ రవీందర్, యాదగిరి, లక్ష్మినారాయణ, గురుప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు

సమాచారం..

18నుంచి ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో ఈనెల 18 నుంచి ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను మంగళవారం నుంచి శనివారం వరకు స్వీకరిస్తామని తెలిపారు.

21న తైబజార్ వేలంపాట

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య సమక్షంలో శనివారం నిర్వహించిన తైబజార్ వేలంపాట వాయిదా పడినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. ప్రభుత్వ ధర రూ. 22లక్షల 86వేలు ఉండగా ఎవరు కూడా ముందుకు రాకపోవడంతో వాయిదా వేశామన్నారు. ఈనెల 21న వేలంపాట ఉంటుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనాలనుకునేవారు ఈ నెల 21లోపు మున్సిపల్ కమిషనర్ మీద డీడీ చెల్లించాలన్నారు. వైస్ చైర్మన్‌షేక్‌మున్ను, సిబ్బంది ఉన్నారు.

17 నుంచి ఉచిత యోగా శిబిరం

రుద్రూర్: మండల కేంద్రంలో పతంజలి యజ్ఞ సహిత యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 17నుంచి 21వరకు (ఐదు రోజులు) ఉచిత యోగా శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు కేంద్రం సభ్యులు మోహన్, మహజన్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. యోగసనాలు, సూర్య నమస్కారాలు, సూక్ష్మ, స్థూల వ్యాయామాలు, యోగిక్ జాగింగ్, ప్రాణాయామం, ధ్యానం, ఆయుర్వేదం, అక్యుప్రెషర్, ముద్ర విజ్ఞానం నేర్పిస్తారని వివరించారు. ఆసక్తి గల వారు 94917 39436, 99494 89697ను సంప్రదించాలని కోరారు.

ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దు



కమ్మర్‌పల్లి: సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని ఆర్మూర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రయివేట్ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం బస్సు డ్రైవర్లు, యాజమాన్యాలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బస్సు నడిపే ముందే తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

పెద్దమ్మకు బోనాల సమర్పణ

వేల్పూర్: మండలంలోని పడగల్ గ్రామంలో ముదిరాజ్‌లు శనివారం పెద్దమ్మకు బోనాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. డప్పువాయిద్యాలు, భాజభజంత్రీలతో బోనాలను ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లారు. గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	మహారాజా (తెలుగు) - 12.45, 6.40, 9.45 మ్యూజిక్ షాప్ మూర్తి (తెలుగు) 3.50
స్క్రీన్-2 –	హరోం హర (తెలుగు) - 12.15, 3.30, 6.45, 10.00
స్క్రీన్-3 –	మనమే (తెలుగు) - 11.45, 3.00, 6.15, 9.30
స్క్రీన్-4 –	చందు చాంపియన్ (హిందీ) - 12.10, 6.05, 9.15, నీ దారే నీ కథ (తెలుగు) - 3.20

సంక్షిప్తం

సీజ్ చేసిన ఇసుకకు వేలంపాట



రెంజల్(బోధన్): మండలంలోని కందకుర్తి శివారులో శుక్రవారం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ సీజ్ చేసిన ఇసుక నిల్వకు శనివారం తహసీల్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. సుమారు 50 ట్రాక్టర్ల ఇసుక నిల్వను దక్కించుకునేందుకు కందకుర్తి, పేపర్‌మిల్ గ్రామాలకు చెందిన వ్యాపారులు పోటీపడ్డారు. కందకుర్తికి చెందిన యువకుడు రూ. 61,500లకు దక్కించుకున్నాడు.

బోధన్‌లో వైద్యశిబిరం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలో శనివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వాసవి, వనిత క్లబ్‌లు హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. అనంతరం నగరేశ్వర, శ్రీనివాస కన్యకా పరమేశ్వర మందిర ఆవరణలో మొక్కలు నాటారు. క్లబ్ ప్రతినిధులు కొత్త రవిందర్, రాణి, సుదర్శన్‌గుప్తా, బెజగం సతీష్, బొంపల్లిరాజు, మకరంద్ జాంకార్, శాంతిశ్రీ ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక

బాల్కొండ: ముప్కాల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సుశాంత స్వరూప, నిత్యశ్రీ, వైష్ణవి, సంధుశ్రీలు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిపు(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైనట్లు హెచ్‌ఎం గంగారాం ఒక ప్రకటనలోతెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నాలుగు సంవత్సరాలపాటు సంవత్సరానికి రూ.12వేల చొప్పున ఉపకారవేతనం కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కేజీబీవీలో శ్రమదానం



కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో శనివారం శ్రమదానం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఆవరణను అధికారులు శుభ్రం చేయించారు. కేజీబీవీలో ఇటీవల ఒకరికి పాము కాటు వేసిందని ప్రత్యేక అధికారి గంగామణి తెలపడంతో అధికారులు జీపీ సిబ్బందితో స్కూలు ఆవరణను శుభ్రం చేయించారు. పాముకాటుకు గురయిన సిబ్బంది ఆరోగ్యం నిలకడగా ఉందని తెలుసుకున్నారు.

ముప్కాల్ జీపీ కార్యదర్శి సస్పెన్షన్

బాల్కొండ: ముప్కాల్ పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్‌ను ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేస్తు ఉత్తర్వులను అందించినట్లు ఎంపీడీవో ముజాఫర్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఇంటి నంబర్ల కేటాయింపులో అవతవకలకు పాల్పడినందుకు పంచాయతీ రాజ్ విభాగం అదనపు కలెక్టర్ తరుణ్‌కుమార్ సస్పెన్షన్ ఉత్తర్వులను జారీ చేసినట్లు పేర్కొన్నారు.

భిక్షాటన చేయిస్తున్న తల్లిపై ఫిర్యాదు

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్‌గ్రామంలో కవిత అనే బాలికను తల్లి సావిత్రి భిక్షాటన చేసి డబ్బులు తీసుకురావాలని చితకబాధింది. ఈఘటనను చూసిన బోధన్ మండలం మావంది ఖుర్దు గ్రామానికి చెందిన కొడల్‌వాడీ పోతయ్య వెంటనే బాలికను పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి, తల్లిపై ఫిర్యాదు చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాం గ్రామానికి చెందిన టీడీపీ నిజామాబాద్ పార్లమెంటు అధ్యక్షుడు దేగాం యాదా గౌడ్ మాతృమూర్తి మణెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.